# కాలింగ్ బెల్

భమిడిపాటి రామగోపాలం

"అందరూ కూర్చోండి" అన్నాను అందరి నమస్కారాలకి ఒకేసారి ప్రతి నమస్కారం చేసి.

మొత్తం పదహారు మంది.

చిన్న గుమస్తాలు, సీనియర్ గుమస్తాలు, హెడ్గుమస్తా, ఔట్‌డోరు ఇనస్పెక్టర్లు, ఇద్దరు టైపిస్టులు రకరకాల వాళ్ళున్నారు ఆ సెక్షన్లో.

నా సంస్థలో రాబడి శాఖ ఆ శెక్షను. సంవత్సరానికి పదహారు లక్షల ఆదాయం వాళ్ళ ఫైళ్ళలో ఉంటుంది. తేదీలవారీగా, గంటలవారీగా ఏయేపార్టీల నుంచి ఎంతెంత సొమ్ము రావాలో ఫైళ్ళలో లెడ్జర్లలో జాగ్రత్తగా రాస్తారు వాళ్ళు. వసూలు కాని మొండి బాకీలమీద దాడులు, సంప్రదింపులు జరుపుతారు. ఇంకా వసూ లవకపోతే దావాలు వేయడానికి కాగితాలు సిద్ధం చేస్తారు.

అంత చురుకైనవాళ్ళుగా, సమర్థులుగా, సంస్థ పట్ల స్వామి భక్తి ప్రదర్శకులుగా, నేనీ సంస్థకు మేనేజింగు డైరెక్టరుగా పని చేస్తున్న ఈ ఐదేళ్ళుగా నాకు తెలుస్తోంది.

అర్జంటుగా ఏదైనా ఆర్డర్ నా నుంచి కావాలంటే గౌరవంగా, వినయంగా, నా గదికివచ్చి ఫైలు చేత్తోపట్టుకొచ్చి కూడా నిమిషాలమీద సంగతంతా బోధపరిచి నా అనుజ్ఞ తీసుకుంటారు. వాళ్ళలో ప్రతి వొక్కరూ, పావుగంటలో ఆ సంగతంతా రాసుకొని, వాళ్ళకీ నాకు మధ్యన ఉన్న సూపరింటెండెంటు చేత, ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుచేత సంతకాలు చేయించుకొని ఫైలు పంపి ఆర్డరు తీసుకుంటారు.

హఠాత్తుగా వాళ్ళ శెక్షనుకి నా అంత పెద్ద ఆఫీసరు వెళ్ళడం, అందులోనూ సూపరింటెండెంటు: ఎ. ఒ. ఎవర్నీ తీసుకెళ్ళకుండా నేను స్వయంగా వెళ్ళిపోవడం వాళ్ళకి కంగారు పుట్టిస్తుందని నాకుతెలుసు.

అందుకనే నేను కూర్చోండనగానే వాళ్ళలో ఏవొక్కరూ కూర్చోలేదు.

నేను హెడ్‌గుమస్తా టేబిలుకు ఎదురుగా ఉన్న వో కుర్చీలో కూర్చున్నాను. "మీరంతా దయచేసి కూర్చోండి నేను మీతో కొంతసేపు గడపాలని వచ్చాను" అని అందర్నీ కూర్చోమని చేతి సంజ్ఞ కూడా చేసి చెప్పాను.

హెడ్‌గుమస్తా ముందు కూర్చున్న తర్వాత అందరూ కూర్చున్నారు. అయితే కుర్చీలో సగం మేరకే కూర్చున్నారు.

హెడ్‌గుమస్తా పరమేశ్వరరావువెంటనే లేచి నన్ను తన సీట్లోకి రమ్మని అర్థించాడు. టేబిలుమీంచి దృష్టి సారించి చూసేను. నేను అతిథులకోసం వేసిన కుర్చీల్లో కూర్చున్నాను. అంతకంటే ఆయన కూర్చునే కుర్చీ మంచిది. పైగా అందులో ఆరంగుళాల మందం ఉన్న ఫోమ్ దిండు ఉంది.

నా ఎదురుగా అతను ఆ కాస్త సుఖం అనుభవించడానికి మొహమాట పడుతున్నట్లు, పోనీ, నేనక్కడ వుండబోయే ఆ కాస్సేపు ఆ సుఖం నాకు ఇచ్చేటందుకు ఆఫర్ చేస్తున్నట్లు నాకు క్షణంలో స్ఫురించింది.

"తమరక్కడ కూర్చుంటే అందరూ తమకి డైరెక్టుగా కనిపిస్తారు." అన్నాడు పరమేశ్వరరావు; నేను అనుకున్నదికాదని స్ఫురించడానికి నేను పెట్టబోయే మీటింగుకి అది అవసరమే.

"ఆల్‌రైట్" అని లేచి వెళ్ళి అతని సీట్లో కూర్చున్నాను.

పరమేశ్వరరావు నేనింతవరకు కూర్చున్న కుర్చీని కొంచెం జరిపాడు. అక్కడ అతను కూర్చుంటే నాకు కనిపించనివారు ఎవ్వరూ ఉండరు.

"ఎలా ఉన్నది పని?" అన్నాను అందర్నీ ఉద్దేశించి తల వృత్తాకారంలో తిప్పి.

"బాగానే వుం"దని వాళ్ళ గుడ గుడ లను బట్టి తెలిసికొన్నాను.

అంతకంటే ఏమి మాట్లాడుతారువాళ్ళు! వాళ్ళలో ఏ ఒక్కరు ఏమి మాట్లాడినా దానికి చిలవలు పలవలుఅల్లి మరొకరెవరో సూపరింటెండెంటుతోనో, ఎ. ఒ. తోనో చెప్పొచ్చునని వాళ్ళలో వాళ్ళకు భయం ఉంటుంది.

"మీరు లేనప్పుడు ఎం. డి గారు మా రూంలోకొస్తే మన గుర్నాథరావు తమరి గురించి ఇలాగన్నారుసారు. నాకు కష్టంవేసి మీకు మనవి చేస్తున్నాను" అని ఈవిధంగా చాడీలు చెప్పడానికి కొందరుసిద్ధంగావచ్చు. ఇద్దరు ముగ్గురు కలిసి ఒకరిమీద, ఒకప్పుడు వాళ్ళలో వాళ్ళు కూడా, ఇలాచెప్పుకోవచ్చు. అలాంటి వాళ్ళు ప్రతి ఆఫీసులోనూ వుంటారు.

"పనిఎక్కువగా ఉంటోందా"అన్నాను ప్రత్యేకంగా పరమేశ్వరరావు నుద్దేశించి. పరమేశ్వరరావు నమ్రతతోనవ్వేరు.

"పనీ—" అని కొంచెం ఆగి; "పని ఉంటుందనుకోండి సార్. అయితే అంత అలవిమాలిన పనిగాదు. అయినా-" అని అందరివేపు ఒకసారి కలియచూసి "ఏవరేజిమీద ప్రతివాడికి వారం మొత్తంమీద ఏడెనిమిది గంటలు అదనంగా జెయ్యవలసిన పని ఉంటోంది"

బెల్ మోగింది. అందరూ డిస్పాచ్ గుమస్తా సుబ్బారావువేపు చూశారు. అతను లేచాడు.

చప్పుడొచ్చినవేపు చూశాను. వీళ్ళందరూ కూర్చునే హాలులోనే, ద్వారం మీదుగా ఓ బెల్ అమర్చబడి ఉంది. అది బజరుకాదు! కరెంటుతో పనిచేసేదయినా కంచుగంటే. శబ్దం కఠోరంగా ఉంది.

సుబ్బారావు హడావుడిగా వెళ్తున్నాడు. చిటికేసి పిలిచాను.

"ఎం. డి. గారు పిల్చారు సార్" అన్నారు పరమేశ్వరరావు.

"వెళ్ళండి, కాని నేనిక్కడున్నానని ఆయనకి చెప్పకండి. ఆయన పనిమీద పిల్చేస్తారో ఏమిటో" అన్నాను.

"ఎస్సార్" అని సుబ్బారావు వెళ్ళాడు.

"కె. అండ్ కె. లిమిటెడ్‌తో మన తగాదా తారా స్థాయికి వొచ్చింది. బహుశ కోర్టుకెళ్ళాల్సి వస్తుందేమో. ఆ ఫైలు జాగ్రత్తగా మొదటినుండి చదివి ముఖ్యమైన విషయాలన్నీ ఒక కాయితంమీద లిస్టు వ్రాయండి" అని పరమేశ్వరరావుకు చెప్పాను.

"అలాగే సార్"

"ఆ ఫైల్లో ఒరిజినల్ నోటు ఎవరు వ్రాస్తారు? మీరేననుకుంటాను, నారాయణ మూర్తిగారూ" అన్నాను.

నారాయణమూర్తి లేచి నిలబడ్డాడు. చేతులు కట్టుకొని "ఎస్సార్" అని తల ఊపాడు.

"కూర్చోండి.... మీరు ముందుగా వ్రాయండి షక లిస్టు. ఆ తర్వాత పరమేశ్వరరావుగారు, మీరూ విడిగా ఫైలు చదివి, ఆయన లిస్టుతో సంబంధం లేకుండా వేరే ఒక లిస్టు ప్రిపేరుచెయ్యండి. ఫాలో?" అన్నాను.

బెల్ మళ్ళీ మ్రోగింది. ఎవరో పిల్చినట్లు కాకుండా ఎవరో ఆపదలో ఉండి ఆర్తనాదం చేసినట్టుంది ఆ ధ్వని.

పరమేశ్వరరావు "ఎక్స్‌క్యూజ్మీసార్" అని లేచి పరుగులాంటి నడకతో బయలు దేరాడు.

"నే చెప్పింది గుర్తుందిగా?" అని నేనన్నమాట అతను ద్వారం దాటుతూ విని, "ఎస్సార్" అని వెళ్ళాడు.

"సుబ్రహ్మణ్యం" మీరెప్పట్నుంచీ శలవులో వెళ్తున్నారు?"

"వెళ్ళటం లేద్సార్" అని సుబ్రహ్మణ్యం లేచాడు.

"నేను గ్రాంట్ చేయలేదా!" కూచో మని సంజ్ఞచేస్తూ అడిగాను.

"తమరు గ్రాంట్ చేశారు సార్" అని తటాంచుకొని "నేనే విత్‌డ్రా చేసు కున్నాను"

అనవసరంగా సెలవు పెట్టొద్దని సర్క్యులర్ ఇచ్చాను. దాని ప్రకారం మీరసలు పెట్టే వుండకూడదుగా?"

"శలవు అవసరమేనండీ, కాని ఆఫీసులో వర్కుందండి. నా సీట్లో రెండు కోర్టు కేసులు నడుస్తున్నాయండి. పదేసి రోజులకో వాయిదా చొప్పున నడుతోంది. రెండింటి మీదా కలిపి. పదిరోజుల్లో ఒక్క రోజే కోర్టుకి రావలసున్నా మిగిలినదినాలు దానికి తయారవడానికి చాలటం లేదండి. నే వెళ్ళిపోతే మీకందరికి శ్రమ ఎక్కువని—"

"ఐసీ" నేను కళ్ళు మూసుకొని టేబిల్‌మీద వ్రేళ్ళతో ఏదో వ్యర్థ ధ్వని చేశాను.

ఇతను శలవులో వెళ్ళాననడం, వెళితే తనకి కలిగే ఇబ్బందీ ఎ. ఓ. నాతో చెప్పాడు. శలవు గ్రాంటు చేసి కూడా నేను రిక్వెస్టు చేశానని చెప్పమని శలవు విత్‌డ్రా చేయించడం నాకు గుర్తుంది. ఈ సంఘటనలో ఎక్కడా నా పేరుగాని ఎ. ఓ. పేరు గాని ఎత్తకుండా తన అసమ్మతిని చెప్పగలిగాడు సుబ్రహ్మణ్యం. నాకతనిమీద దయకలిగింది.. నా మీద గర్వం కూడా కలిగింది.

పరమేశ్వరరావు, సుబ్బారావు చెరో ఫైలు పట్టుకుని వచ్చారు. ఎవరి జాగాల్లో వారు కూర్చున్నారు.

బెల్ మ్రోగింది. బౌట్‌డోర్ ఇనస్పెక్టరు ప్రసాదరావు లేచి వెళ్ళాడు.

బెల్ శబ్దం కఠోరంగా వుంది. రక్షించండి బాబోయ్ అని కేకేసినట్టుంది అప్రయత్నంగా.

బెల్ మళ్ళీ మ్రోగింది. ఈమారు సీనియర్ క్లర్కు గుర్నాథం లేచి వెళ్ళాడు.

"ఈ బెల్ ఎప్పుడు పెట్టారు?" అన్నాను

"కొత్త ఎ. ఓ. గారు జాయినైన పదిహేను రోజులకి పెట్టారండి" అన్నాడు పరమేశ్వర్రావు.

"బెల్ మోగగానే ఫలానావార్ని పిలిచినట్టు వెళ్ళిపోతున్నారే. హౌ ఈజిట్ పాజిబుల్" అన్నాను.

అందరూ నవ్వేశారు.

ఈ మాత్రం తెలీదా అని అనవచ్చ కర్థం చెప్పుకోవచ్చు.

కాని-వాళ్ళు తన్నలా తేలికచెయ్యరు!

"దీనికో కథుంది. అర్థమైతే అంతా తెలిసివస్తే" అని దానర్థం. అది నాకు స్ఫురించింది.

పరమేశ్వరరావు గొంతు సర్దుకున్నాడు.

"బెల్ మోత స్థాయినిబట్టి, పరిమాణాన్ని బట్టి ఎ. ఓ. గారు మాలో ఎవర్ని పిల్చింది మాకు గుర్తేనండి"

"అంటే?"

"నేను వారిదగ్గరకు వెళ్ళాలనుకోండి. నాలుగుసార్లు మ్రోగుతుందండి. డిస్పాచ్ క్లర్కు అయితే లాంగ్‌గా షార్ప్‌గా మ్రోగుతుందండి ప్రసాదరావుకి మూడు రింగ్స్, అనంతరావుకి రెండు, ఇలాగ ఎవరి గుర్తు వారికుందండి" అన్నాడు.

"టైపిస్టు సురేంద్రనాథ్ ఒకఅట్ట తెచ్చిచ్చాడు. దానిమీద ఓ కాగితం అంటించి వుంది. ఆ కాగితంమీద—

....హెచ్. సి .. ఓ. ఐ (వన్) . — . — ఓ. ఐ (టూ) ఇలా పదహారు లైన్లు ఉన్నాయి.

చూసీ చూడగానే ఎ. ఓ.గారి కాలింగ్ బెల్ పథకం అర్థమైపోయింది. చాలా సంతోషించేను.

"ఇలాటి అట్టలు అందరి దగ్గరా తలోటి ఉన్నాయన్నమాట. యామై కరెక్ట్"అన్నా.

"ఎస్సార్" అన్నారు అందరూ ఏక కంఠంగా.

"మీ ఏ. ఓ. గారిక్కూడా ఒకటి తయారుచేసి యివ్వలేకపోయేరా?" అని వేళాకోళం చేసేను.

"ఇచ్చేంగదండి!" అని చాలా సీన్సియర్‌గా జవాబు.

"ఐసీ" అని ఒక్కక్షణం ఆలోచించి, టైపిస్టుకి సంజ్ఞచేసి అతనిచ్చిన అట్ట అతనికిచ్చేశాను.

"పరమేశ్వర్రావుగారూ మీ ఎ. ఓ. గార్ని నేను పిలుస్తున్నానని చెప్పండి. ఐ వాంట్ టు కంగ్రాట్యులేట్ హిమ్ ఆన్‌ది స్కీమ్ ఆఫ్ దిస్ కాలింగ్ బెల్" అన్నాను.

"అలాగే సార్" అని వెళ్ళాడతను.

బెల్ మళ్ళీ మ్రోగింది మూడు చిన్న ధ్వనులు. ఒక పెద్దధ్వని. స్పష్టంగా ఉంది కాని అతి కర్ణకఠోరంగా ఉంది మోత.

అందరూ బెల్‌వేపు చూశారు. నేను వాళ్ళందరివేపు చూశాను ఎవరు లేస్తారా

ఆని.

సుబ్రహ్మణ్యం లేచాడు.

"నో, కూర్చోండి. ఆయనే వస్తున్నారుగా" అన్నాను.

సుబ్రమణ్యం విస్మయంగా చూస్తూ కూచున్నాడు.

ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు రాజారామ్ హడావుడిగా హాల్లోకొచ్చాడు. "నమస్కారం సార్!....ఏమిటి నా యూనిట్ లోకి స్వయంగా వచ్చేశారే. ఎంతసేపైందండి వచ్చి? ఈజ్ ఆల్ వెల్ సర్?"

"టెన్ మినిట్స్ అంతే"

"ఏమయ్యా ఎవరూ చెప్పేరుగారేం? ఈ పది నిముషాల్లో మీరు నా రూమ్ కొచ్చేరుగా?" అని డిస్పాచ్ క్లర్కు వేపు హెడ్ గుమస్తావేపు చూస్తూ అన్నాడు రాజారాం.

వాళ్ళిద్దరూ ఏం అనలేదు.

"ఓ, కే!" అని లేచాను. ఎ. ఓ. రాజారాంను రెండు నిముషాలు అక్కడ నిలబడమని తిన్నగా ఆయన రూంలోకెళ్ళి కాలింగ్ బెల్ని దీర్ఘంగా అదిమిపట్టాను. నేను ఎ. ఓ. రూంలోంచి బయటపడేసరికి ఆయన కంగారుగా పరిగెత్తుకుంటూ వచ్చారు.

"లెట్స్ గో టు మై చాంబర్స్" అని ముందుకు దారితీశాను.

* * *

"మీకు యింకో యిద్దరు స్టాఫ్ కావాలన్నారు?"

"ఎస్సార్"

"మీ ప్రపోజల్ యిదిగో తీసుకోండి నేను రిటర్న్ చేస్తున్నాను."

"ఎస్సార్"

"మీ ప్రపోజల్ నేను అప్రూవు చేయటంలేదని మీరేమీ యిదవ్వద్దు. పది రోజులాగి మళ్ళీ పంపండి."

"ఎస్సార్"

"ఈ పది రోజుల్లో మీరు చెయ్యవలసిన పని కొన్ని పనులున్నాయి"

"చెప్పండి సార్"

"కేశవ్ ప్యూన్ చాలాకాలంనుంచి నాకు కనబడ్డంలేదు. సెలవులో ఉన్నాడను కొన్నాను!"

"........!"

"అతనికి జీతం యిస్తున్నాం. డ్యూటీ మీద తిరిగి అతనికి వచ్చే ఇన్సిడెంటల్స్ బిల్సుకూడా పే చేస్తున్నాం. ఏమైపోయాడా అని ఇన్వెస్టిగేట్ చేస్తే అతను మీ డ్యూటీలో ఉన్నాడని తేలింది."

"నో సర్ — నేను మనని చేసేదేమి ఉంది —" అని కుర్చీలో కొంచెం ముందుకి జరిగి తలకూడా ముందుకి జాపాడు ఏ. ఓ. రాజారాం.

"మిస్టర్ రాజారాం. నేను మిమ్మల్నేం తప్పుపట్టటంలేదు. కంపెనీ ఇంటరెస్టు దృష్ట్యా మాట్లాడుతున్నాను. మీ ప్యూను నా కాఫీసులో కనబడక పోయేసరికి వర్రీ అయ్యాను నేను. అతనికి బాగాలేదేమోననుకొని రిజిస్టర్స్ తెప్పించాను. అతను ఆఫీసు కొస్తున్నట్లు అటెండెన్సులో సంతకాలుంటున్నాయి. ఒంట్లో బావులేక ఇక్కడ కూచోలేక సంతకాలెట్టేసి వెళ్ళిపోతున్నాడేమోనని అనుమానం కలిగింది. దీనిమీద ఇన్వెస్టిగేషన్ చేశాను. అతను పొద్దుట పదింటికి ఆఫీసుకి వస్తున్నాడు. మీది, మీ ఆఫీసు సూపరింటెండెంటుది పాస్ బుక్స్ తీసుకొని మీరు రోజూ బ్యాంకులో వేస్తున్న రోజువారీ డిపాజిట్ వాయిదాలు చెల్లించి పదకొండింటికి మీ యిళ్ళకి వెళ్తున్నాడు. ఒంటిగంటకల్లా మీ యిద్దరి ఉత్తరాలు, మధ్యాహ్నం భోజనాలు తెస్తున్నాడు సైకిలుకి కట్టుకొని. రెండింటికి ఆఫీసు టపాలు తీసుకొని లోకల్ డెలివరీకని వెళ్ళి నాలుగింటికి మీ అమ్మాయిని కాన్వెంట్ దగ్గర సైకిలెక్కించుకొని అక్కణ్ణుంచలా యింటికివెళ్ళి టపా పుస్తకంతోసహా మర్నాడు పొద్దుట పదకొండికి ఆఫీసు కొస్తున్నాడు".



"అయాం సారీసర్" అన్నాడు రాజారాం "మీ, అభిప్రాయం రైటు కాదేమోనని మనవి"

"ఒకవేళ రైటు కాకపోయినా దాన్ని గురించి మీరు పట్టించుకోకండి. ఆ ప్యూన్ నాకిచ్చిన స్టేట్మెంటు నేను బయట పెట్టటంలేదు. రేపట్నుంచి మీ కేశవుకి ప్యూనుగా అప్పారావుకి బదులు సింహాచలం వస్తాడు. పని సరిగ్గా జరగడానికి కొన్నాళ్ళపాటు నేను మీకు చెప్పినట్లు చేసి చూడండి. అదేంటంటే ఒకటి – మీ కేశవు కిచ్చిన ప్యూన్ని అంటే సింహాచలాన్ని ఆఫీసు పనిచేసేవేళల్లో ఆఫీసులోనే ఉండమనండి. రెండు – మీరు క్లర్కుల హాల్లో పెట్టించిన బెల్లు తీయించేయండి.

"మీరు స్టాఫ్లో ఎఫిషియెన్సీ తగ్గిపోతుందని వ్రాశారు. మీరు క్లర్కుహాల్లో పెట్టించిన బెల్లు ఎంత కఠోరంగా మోగుతోందో యిప్పుడే మీరు తెలిసికొన్నారుగా! మీ కెవర్ని పిలవాలనుకుంటే ఎలా మ్రోగిస్తారో దానికి మీరిచ్చిన సిగ్నల్సు చూశాను. మీరు ప్రస్తుతం ఉన్న స్టాఫ్ పదహారు మందీ కూడా ఏ కాగితం వ్రాస్తున్నా ఏం ఆలోచిస్తున్నా ఏ క్షణాన ఆ బెల్ మ్రోగుతుందోనని ఒక కన్ను, ఒక చెవి ఆ బెల్కు వొప్పగించి పనిచేస్తున్నారు. వాళ్ళలో ప్రతి ఒక్కరికి ఆ బెల్ను ప్రత్యేక శ్రద్ధతో వినవలసిన అవసరం ఉంటోంది. ప్రతి ఒక్కరు బెల్పిలుపు తనకేనో కాదో తెలుసుకోవలసిన అవసరం వుందికదా! బెల్లుమీద శ్రద్ధతో పని మీద దృష్టినిల్పలేక పోతున్నారు. ఆ బెల్ చేసే కర్ణకఠోరమైన ధ్వనితో, ఆ బెల్ మోతలోని పిలుపు ఎవరికో తెలుసుకొందుకి చూపే శ్రద్ధతో వాళ్ళ పనిమీద దృష్టిలేక ఎఫిషెన్సీ పడిపోయుంటుంది. గాని మరో కారణంచేత కాదని నేను తెలుసుకొన్నాను అంచేత—"

"తమరు చెప్పినట్లు చేస్తాన్సార్" అని రాజారాం సెలవు తీసుకు వెళ్ళాడు.

*